సాక్షి నల్లగొండ

ఆదివారం । 10 । ఆగస్టు । 2025



ఉపాధి మెండుగా..

జిల్లాలో శ్రావణ బోనాల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో అనుబంధ వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. - 8లో



డీజిల్ చోరీకి యత్నం

నార్కట్‌పల్లి వద్ద ఆగిఉన్న లారీల నుంచి డీజిల్ చోరీ చేసేందుకు పలువురు దుండగులు యత్నించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	44,647 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	44,647 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	29,070 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	6,041 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,436 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

13 వరకు రైతు బీమా దరఖాస్తులు

నల్లగొండ అగ్రికల్చర్ : కొత్తగా పాస్‌బుక్‌తో వచ్చిన రైతులంతా రైతు బీమా కోసం ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన, 18 నుంచి 59 సంవత్సరాల వరకు వయసు ఉన్న రైతులందరూ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో పూర్తి చేసిన దరఖాస్తులను ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూర్ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ నుంచి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఈ నీటితో కొండకిందిగూడెం, బండపాలెం, ఐనుపాముల, కేతేపల్లి, కొర్లపహాడ్, నోముల, నకిరేకల్ చెరువులను నింపుతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజుల మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు సుంకర బోయిన నర్సింహ, మాద యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నంద్యాల వెంకట్‌రెడ్డి, బెజవాడ సైదులు, చెవుగోని సాయిలు, ఎడ్ల పెదరాములు, చెవుగోని రవి, మర్రి రాజు, ముక్కాముల శేఖర్, ఇరిగేషన్ డీఈ భూషణాచారి, ఏఈలు పాండు, చందన ఉన్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగంగా దేవరకొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం–గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రాచీన చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయాలకు, నిరాడంబరతకు నిలువటద్దంగా నిలిచే జీవనశైలి ఆదివాసీ సొంతమన్నారు. దేశంలో ఆదివాసీలు సమానత్వం, హక్కులు, వివక్ష లేని సమాజం కోసం ఇంకా ఉద్యమిస్తూనే ఉన్నారని వారి హక్కుల పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఛత్రునాయక్, ఎంపీడీఓ డానియల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, వేణుధర్‌రెడ్డి, బిక్కునాయక్, కొర్ర రాంసింగ్ తదితరులు ఉన్నారు.

పండుగ వేళ ఆర్టీసీ బాదుడు



మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ బస్సు టికెట్

మిర్యాలగూడ టౌన్, కొండమల్లెపల్లి : పండుగకు ఆర్టీసీ ప్రయాణికులపై చార్జీల భారం మోపుతోంది. రాఖీ పండుగ సందర్భంగా రీజియన్ పరిధిలో బస్ చార్జీలను 20 శాతం నుంచి 30 శాతం వరకు పెంచింది. మామూలు రోజుల్లో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సుకు చార్జీ రూ.310 ఉండగా.. రాఖీ రోజున రూ.430కి పెంచింది. అంటే ఒక్క టికెట్‌పై రూ.120 అదనంగా వసూలు చేసింది. దేవరకొండ నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్‌చార్జీ రూ.160 ఉండగా రూ.220 వసూలు చేశారు. ఓ పక్క మహిళలకు ఫ్రీ ఇస్తూనే.. పండగ స్పెషల్ అంటూ అదనపు చార్జీలు వసూలు చేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● దుందుబి పరవళ్లు



డిండి : భారీ వర్షాలకు ఉప్పొంగి ప్రవహిస్తూ డిండి ప్రాజెక్టు వైపు పరుగులు తీస్తున్న దుందుబి వాగు

● మూసీ ఉధృతి




మూసీ ఐదు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు


కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం వరకు ఎగువ నుంచి 5,082 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్‌గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 9,598 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా.. నీటిమట్టాన్ని 643.50 వద్ద నిలకడగా ఉంచి ఎగువ నుంచి వస్తున్న వరద మొత్తం దిగువకు వదులుతున్నారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 286 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.0 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మధు తెలిపారు.

ఏరియల్ లైడార్ సర్వే

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకానికి ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ

- ఆరు నెలలుగా నిలిచిన పనుల్లో కదలిక
- తాజాగా రెండు రకాల సర్వేకు ప్రభుత్వం కసరత్తు
- సర్వేకు రూ.2.36 కోట్లతో పరిపాలనా అనుమతులు
- 9.56 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయితే నల్లగొండకు జలసిరి





సాక్షి ప్రతినిధి, నల్లగొండ : శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులపై ఆశలు చిగురిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఇన్‌లెట్‌లోని 14వ కిలోమీటరు వద్ద జరిగిన ప్రమాదంతో ఆగిపోయిన పనులను మళ్లీ ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ప్రమాదం జరిగిన చోట టన్నెల్‌ను తవ్వే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా టన్నెల్ పనులను పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా రెండు రకాల సర్వేలు చేయిస్తోంది. వాటి నివేదికల ఆధారంగా ప్రత్యామ్నాయ మార్గాల్లో టన్నల్ తవ్వకం పనులను పక్కాగా చేపట్టేందుకు ప్రణాళిక రచిస్తోంది. ఇందులో భాగంగా జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో ఏరియల్ లైడార్ సర్వే నిర్వహించేలా చర్యలు చేపడుతోంది. మరోవైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేషనల్ జియో ఫిజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో వీటెమ్ ప్లస్ మాగ్నెటిక్ జియో ఫిజికల్ సర్వేను చేపట్టాలని నిర్ణయించింది. ఈ సర్వేలు చేపట్టేందుకు రూ.2.36 కోట్లు విడుదల చేస్తూ శుక్రవారం పాలనపరమైన అనుమతులు జారీ చేసింది.

అవాంతరాలతో ఆలస్యం..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.15 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో 2005లో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను ప్రభుత్వం చేపట్టింది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పూర్తి గ్రావిటీ ద్వారా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లికి వరకు నీటిని తరలించేందుకు 43.930 కిలోమీటర్ల పొడవునా సొరంగం తవ్వకాన్ని చేపట్టింది. ఇన్‌లెట్, ఔట్‌లెట్ కలిపి 34.37 కిలోమీటర్లు టన్నెల్ తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అందులో ఔట్‌లెట్‌లో 20.435 కిలోమీటర్లు సొరంగం తవ్వకం పూర్తి కాగా, మరో 3.545 కిలోమీటర్ల తవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో టీబీఎం బేరింగ్ పాడైపోవడంతో 2023 జనవరిలో పనులు ఆగిపోయాయి. అదే ఏడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబర్‌లోనే నిధులను వెచ్చించి అమెరికా నుంచి బేరింగ్ తెప్పించ్చింది. బేరింగ్ ఏప్రిల్ నెలలో మన్నెవారిపల్లికి చేరుకుంది. బేరింగ్‌ను టీబీఎంకు అమర్చేందుకు అవసరమైన పరికరాలు కెనడా నుంచి రావాల్సి ఉంది. డబ్బుల సమస్యతో అవేవీ రాలేదు. దీంతో బేరింగ్ వచ్చినా టన్నెల్ లోపలికి కూడా తీసుకెళ్లలేదు.

వేగం పుంజుకోనున్న సర్వే పనులు

టన్నెల్ ప్రాంతం అంతా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో వన్యప్రాణులు, పర్యావరణ రక్షణ కోసం డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం కాకుండా టీబీఎం ద్వారా తవ్వకాన్ని చేపట్టింది. అయితే ఇన్‌లెట్ కుప్పకూలిపోవడంతో ఇప్పుడు ఎలా ముందుకు సాగాలనే విషయంలో పలు అంశాలను పరిశీలిస్తోంది. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాల్లో టన్నెల్ తవ్వాలన్న దానిపై రెండు రకాల సర్వే చేపట్టేందుకు ఉపక్రమించింది. అందుకు నిధులు కూడా విడుదల చేసింది. ఔట్‌లెట్‌లోనూ బేరింగ్ బిగించేందుకు అవసరమైన పరికరాలను తెప్పించేందుకు కసరత్తు చేస్తోంది.

ఇన్‌లెట్‌లో ప్రత్యామ్నాయాలపైనే ప్రత్యేక దృష్టి

సొరంగం ఇన్‌లెట్ దోమలపెంట వైపు నుంచి 13.935 కిలోమీటర్ల తవ్వకం పూర్తయింది. ఇంకా 6.015 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అయితే 14వ కిలోమీటరు కంటే ముందు షియర్ జోన్ కారణంగా పెద్ద ఎత్తున బురద, మట్టి ఉబికి వస్తుండటంతో పనులు 2019లోనే ఆగిపోయాయి. అప్పటి నుంచి అక్కడ డీవాటరింగ్ మాత్రమే కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన పనులను ప్రారంభించారు. టీబీఎంతో తవ్వుతుండగా సొరంగం పైకప్పు కూలి ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రమాద దాటికి టీబీఎం ముక్కలైపోయింది. 8 మంది గల్లంతయ్యారు. వారిని వెలికి తీసేందుకు 60 రోజులకుపైగా సహాయక చర్యలు కొనసాగాయి. ఇద్దరు కార్మికుల మృతదేహాలను మాత్రమే వెలికితీయగా, ఇంకా ఆరుగురి జాడ తెలియలేదు. పైకప్పు మళ్లీ కూలేందుకు అవకాశం ఉండటంతో సహాయక చర్యలు ఆపేశారు. అయితే ఇన్‌లెట్‌లో 14వ కిలోమీటరు వద్ద కుప్పకూలిన ప్రాంతానికి కంటే ముందు నుంచి యాభై మీటర్ల పక్కకు జరిగి, అక్కడి నుంచి సమాంతరంగా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ పద్ధతిలో సొరంగం తవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం రెండు జాతీయ సంస్థల ఆధ్వర్యంలో సర్వే చేపట్టాలని నిర్ణయించింది.

మూడు నెలలుగా మందుల కొరత

- వెల్‌నెస్ సెంటర్‌లో మూడు నాలుగు రకాలు మాత్రలే అందుబాటులో..
- దీర్ఘకాలిక వ్యాధుల ట్యాబ్లెట్లు లేవంటున్న సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న హెల్త్ కార్డుదారులు



నల్లగొండలోని వెల్‌నెస్ సెంటర్

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌కు మందుల కొరత పట్టిపీడిస్తుంది. మూడు నెలలుగా పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండడం లేదు. కేవలం మూడు నాలుగు రకాల ట్యాబ్లెట్‌లు, కొన్ని క్రీమ్‌లు, చిన్నాచితక మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నెలనెలా మందుల కోసం వచ్చే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇక్కడికే..

ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లు, జర్నలిస్టులు.. వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా వైద్య సేవలను అందించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. హెల్త్ కార్డులు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్‌లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా బీపీ, షుగర్, గుండె, కిడ్నీ , కీళ్ల నొప్పుల వంటి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారు ప్రతి నెలా వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చి ఉచితంగా మందులను తీసుకెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వారు ఇక్కడికి వచ్చి డాక్టర్లకు చూపించుకుని మందులు తీసుకుంటారు. కానీ మూడు నెలలుగా సక్రమంగా మందులు లేకపోవడంతో ఉన్న మూడు నాలుగు రకాల ట్యాబ్లెట్లు, సిరప్‌లు, క్రీమ్‌లు ఇచ్చి పంపుతున్నారు. మిగతా మందులు వచ్చాగా వచ్చి తీసుకుపోవాలని ఫార్మసిస్టులు సూచిస్తున్నారు. పూర్తి స్థాయిలో మందులు లేని కారణంగా దూరం ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉంచేలా చూడాలని కోరుతున్నారు.

ఇండెంట్ పంపించాం

వెల్‌నెస్ సెంటర్‌లో అవసరమైన మందుల కోసం ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఇండెంట్ పంపించాం. దశల వారీగా పంపుతున్నారు. పేషంట్‌ల సంఖ్యకూడా గణనీయంగా పెరిగింది. మందులు తక్కువగా పంపిస్తున్నారు. రోగులకు ఇంబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ లావణ్య, వెల్‌నెస్‌సెంటర్ ఇన్‌చార్జి

కోదాడకే 'నవోదయ'ం

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- కేఆర్‌ఆర్ కళాశాల స్థలంలో ఏర్పాటు
- 19.12 ఎకరాల భూమి కేటాయింపు
- భవన నిర్మాణాలకు రూ.50 కోట్లు మంజూరు

కోదాడ: కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట జిల్లాకు మంజూరు చేసిన నవోదయ విద్యాలయాన్ని కోదాడలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. అయితే కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్ వద్ద ఉన్న కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన స్థలంలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. డిగ్రీ కళాశాలకు దాదాపు 50 ఎకరాల స్థలం ఉండగా దానిలో 25 ఎకరాల స్థలం వృథాగా ఉంది. దీనిలో 19.12 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం నవోదయ విద్యాలయానికి కేటాయించారు.

త్వరలోనే టెండర్ల ప్రక్రియ

కోదాడలో ఏర్పాటు చేయబోయే నవోదయ విద్యాలయంలో 6వ తరగతి నుంచి 12 వతరగతి వరకు సీబీఎస్ఈ విధానంలో బోధన జరుగుతుంది. ఈ విద్యాసంవత్సరం (2025–26)లోనే సూర్యాపేటలో దీన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విషయం విదితమే. కేఆర్‌ఆర్ కళాశాల వద్ద ప్రభుత్వం కేటాయించిన ఈ స్థలంలో విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లను మంజూరు చేసింది. త్వరలోనే నవోదయ విద్యాలయ సమితి టెండర్లను పిలిచి భవన నిర్మాణ పనులను చేపట్టనుంది. భవన నిర్మాణాలు పూర్తికాగానే ప్రస్తుతం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నడుస్తున్న ఈ విద్యాలయాన్ని కోదాడకు మార్చనున్నారు. ఈ నవోదయ విద్యాలయానికి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయం మంజూరు చేయడంపై ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గురుకులంలో రక్షాబంధన్



మిర్యాలగూడ : ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌కు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవ పూజలు చేశారు. సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయంలో ఊరేగించారు.

పూర్తిస్థాయి నీటిమట్టానికి సాగర్

- మరోసారి తెరుచుకోనున్న క్రస్ట్‌గేట్లు

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. నాగార్జునసాగర్ గరిష్టస్థాయి నీటిమట్టం 590.00 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 589.70 అడుగులు (311.1486 టీఎంసీలు)గా ఉంది. ఎగువనగల శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 65,780 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి 65,530 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం నుంచి విద్యుదుత్పాదన ద్వారా కృష్ణా నదిలోకి 29,313 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాలువల ద్వారా మరో 15,577 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతుండడం.. ప్రాజెక్టు గరిష్టస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో ఆదివారం ఉదయం క్రస్ట్ గేట్లను ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.



నీటితో కళకళలాడుతున్న సాగర్ జలాశయం

పంట పొలాల్లో ఇసుక మేట

- భారీగా దెబ్బతిన్న పంటలు
- ధ్వంసమైన లింకురోడ్లు
- శాలిగౌరారం మండలాన్ని అతలాకుతలం చేసిన వర్షం





శాలిగౌరారంలో వరినాటు మడిలో ఇసుకమేట, వరదనీటి ప్రవాహానికి ధ్వంసమైన ఊట్కూరు-బండమీదిగూడెం మెటల్‌రోడ్డు

శాలిగౌరారం : మండలంలో గురువారం కురిసిన అతి భారీ వర్షం శాలిగౌరారం మండలాన్ని అతలాకుతలం చేసింది. 14.1 సెంటీమీటర్ల వర్షంతో మండలకేంద్రంతో పాటూ మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు వరదనీటిలో మునిగి చెరువులు, కుంటలను తలపించాయి. భారీ వర్షంతో పోటెత్తిన వరదలకు ఆయా గ్రామాల్లో వరి, పత్తి పంటపొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శనివారం నాటికి వరదలు కొనసాగుతూనే ఉన్నాయి. మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద గల లోతట్టు ప్రాంతంలో వరదనీటి ప్రభావం అత్యధికంగా ఉండటంతో వరి చేలకు తీవ్ర నష్టం వాటిల్లింది. శాలిగౌరారం ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలతో పాటూ రామగిరి, తిరుమలరాయునిగూడెం, శాలిగౌరారం గ్రామాల వరదనీరు మొత్తం శాలిగౌరారం బస్టాప్ వద్ద ఉన్న లోతట్టు భూములమీదుగానే ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

దెబ్బతిన్న అనుసంధాన రోడ్లు..

భారీ వర్షానికి మండలంలోని గ్రామాలకు మధ్యన అనుసంధానంగా ఉన్న లింక్‌రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా రోడ్లపై రాకపోకలు సాగించడం కష్టతరంగా మారింది. అందులో ప్రధానంగా ఊట్కూరు-బండమీదిగూడెం గ్రామం రోడ్డు, భైరవునిబండ-అడ్డెలోనిబావి రోడ్డు, శాలిలింగోటం-తుడిమిడి రోడ్డు, అంభారిపేట-చిత్తలూరి రోడ్లు ఉన్నాయి. బండమీదిగూడెం మెటల్‌రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాళ్లు తేలడంతో వాహనాలు సైతం నడువ లేని అధ్వాన్న పరిస్థితి ఏర్పడింది.

పొలంలో ఇసుక మేటలు వేశాయి



శాలిగౌరారం బస్టాప్ వద్ద నాకున్న ఎకరం భూమిలో ఇటీవలే వరినాటు వేశాను. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాల్వ కట్ట తెగి పొలంమీదుగా వరద ప్రవహించింది. పొలం మొత్తం రాళ్లు, ఇసుక మేటలు వేశాయి. రూ.30 వేలు ఖర్చుపెట్టి పంటసాగు చేస్తే వర్షం నా పొలాన్ని రాళ్ల కుప్పగా మార్చింది. ప్రభుత్వమే మమ్ములను ఆదుకుని న్యాయం చేయాలి.

– షేక్ మహబూబ్‌అలీ, రైతు, శాలిగౌరారం

క్లుప్తంగా

మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ



చెట్టుకు రాఖీ కడుతున్న పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు

కోదాడ: మొక్కలను రక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ వృక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టి మొక్కలకు రాఖీలను కట్టి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని పర్యావరణ ఉద్యమకారుడు కొల్లు వెంకటేశ్వరరావు అన్నారు. రాఖీ పర్వదినాన్ని పరస్కరించుకొని కోదాడ పట్టణ పరిధిలోని అశోక్ నగర్ వద్ద ఆయన ఆధ్వర్యంలో శనివారం మొక్కలకు రాఖీలు కట్టారు. ప్రతి ఇంట్లో చిన్నా పెద్దా మొక్కల ప్రాధాన్యతను గుర్తించి ఈ కార్యక్రమాన్ని తమ ఇంటి నుంచే ప్రారంభించాలని, ముందు ఇంట్లో మొక్కలను, ఆ తర్వాత ఇంటి ముందు మొక్కలను రక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ బషీరుద్దీన్, ఆవుల శివప్రసాద్, షేక్ షరీపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న సోదరుడి వద్దకు వెళ్లి..

- రాఖీ కట్టిన సోదరి



సూర్యాపేట జిల్లా కేంద్రంలో కానిస్టేబుల్ శ్రీనుకు రాఖీ కడుతున్న అతడి సోదరి సుజాత

అర్వపల్లి: కానిస్టేబుల్‌గా విధుల్లో ఉన్న సోదరుడి వద్దకే వెళ్లి రాఖీ కట్టి తన ప్రేమను చాటుకుంది ఓ సోదరి. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన రమావత్ సుధాకర్ భార్య సుజాత శనివారం తన సోదరుడికి రాఖీ కట్టడానికి సూర్యాపేట జిల్లా కేంద్రానికి వెళ్లింది. ఆమె సోదరుడు లునావత్ శ్రీను సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఉండగా సుజాత నేరుగా అక్కడికి వెళ్లి పొట్టి శ్రీరాములు విగ్రహం పక్కనే సోదరుడు శ్రీనుకు రాఖీ కట్టింది.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

కేతేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేతేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన దుబ్బాక రాంరెడ్డి (47) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. అప్పు తీర్చకపోగా మద్యం సేవిస్తూ కొంతకాలంగా పనికి వెళ్లడం లేదు. ఈ విషయమై భార్య స్వాతితో తరుచూ గొడవ పడుతుండేవాడు. శుక్రవారం భార్యతో గొడవ పడి మనస్తాపం చెందిన రాంరెడ్డి ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

• సోదరా నీవే రక్ష

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సాక్షి నిర్వహించిన 'సెల్ఫీ విత్ రాఖీ' ఆహ్వానానికి విశేష స్పందన లభించింది. మహిళలు, యువతులు, బాలికలు తమ సోదరులకు రాఖీ కట్టి సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..



కల్పన, నల్లగొండ
దేవులపల్లి విద్య, వర్షిత్, నకిరేకల్
పి.మహతి, సాయిహర్షిత్, కేతేపల్లి
పెద్ది మనోగ్న, పెద్ది సరయు, పెద్ది అభిజ్ఞ, చిట్యాల
బత్తుల అక్షయ శ్రీజ, బ్రాహ్మణవెల్లెంల
గౌతమ్, మైత్రి, పులిమామిడి
గజవెల్లి సత్తయ్య, నల్లగొండ
ప్రియాంక, స్వర్ణ ప్యాలెస్, నల్లగొండ
దూస అక్షయ, చండూరు
హర్షితసాయి, ఎల్లాపురం
రాధిక, విజయలక్ష్మి, నల్లగొండ
హిమ, తనిష్, హాలియా
ఇందు హాసిత, నకిరేకల్
రితికారెడ్డి, నల్లగొండ
ప్రశాంత్, చిన్నకాపర్తి
కీర్తి, మిర్యాలగూడ
భగవత్, చండూరు
సుస్మిత, నకిరేకల్
మేధశ్రీ, నల్లగొండ
క్రితిక, హాలియా
షన్ముఖి, గుణశ్రీ, మిర్యాలగూడ
బోయినపల్లి కవిత, చిట్యాల
భారతమ్మ, నకిరేకల్
నర్సింహమూర్తి, నకిరేకల్
లక్ష్మణరావు, చిట్యాల
పార్వతి, తూప్రాన్‌పేట
గుండగోని కృతిక, పానగల్
జాను, నల్లగొండ
శాంత్‌కుమార్, చాడంపల్లి
సింధు, దేవరకొండ
శ్రీచేతన, నల్లగొండ
నగేష్, చింతపల్లి
వినూత్నశ్రీ, పుల్లెంల
కృతిక, నల్లగొండ
జాజుల జ్యోతి, పుల్లెంల
చిత్తలూరి పవిత్ర, నెమ్మాని
పబ్బు నవ్య, నెమ్మాని
భావన, నకిరేకల్
లత, నాగార్జునసాగర్
కున్‌రెడ్డి ప్రణవిక, నిడమనూరు
నందిత, నాగార్జునసాగర్
దివిష, యశ్వికారెడ్డి, నల్లగొండ
సాహితీ, నాగార్జునసాగర్
దాసరి మమత, నకిరేకల్
యశ్వంత్, కట్టంగూర్
పాలకూరి నర్సింహ, ఉరుమడ్ల
సత్యనారాయణ, చందుపట్ల
గోషిక, ప్రదీప్, నల్లగొండ
రవి, పెద్దదేవులపల్లి

బుద్ధవనం సందర్శనకు అమెరికన్ల ఆసక్తి



న్యూయార్క్ కెనాల్స్ వీధిలోని బౌద్ధాలయంలో శివనాగిరెడ్డి (ఎడమ)

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, నాగార్జున కొండను సందర్శించటానికి అమెరికాలోని న్యూయార్క్ నగరంలో గల మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనబర్చారని బౌద్ధ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. బౌద్ధాలయాల సందర్శనలో భాగంగా శనివారం ఆయన న్యూయార్క్ కెనాల్ వీధిలోని మహాయాన బౌద్ధాలయాన్ని సందర్శించి బుద్ధవనం, నాగార్జున కొండను సందర్శించమని ప్రధానాచార్యుడిని ఆహ్వానించినట్లు తెలిపారు. బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి రచనలపై ఒక పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పాలని, కృష్ణా నది తీరంలో విలసిల్లిన ప్రముఖ బౌద్ధ స్థావరాల వివరాలను తెలుసుకోవడానికి తగిన సమాచారం అందజేయమని బుద్ధ విహార ప్రధానాచార్యుడు కోరారని ఆయన పేర్కొన్నారు. బుద్ధవనం అధికారులను కలిసి ఈ విషయంపై చర్చించి కేవలం దక్షిణాసియా దేశాల నుంచే కాక యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల బౌద్ధ పర్యాటకులను ఆకర్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు నాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట ప్రముఖ ఆహార శాస్త్రవేత్త, న్యూయార్క్ తెలుగు లిటరరీ అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి, కథా రచయిత డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు ఉన్నారు.

లారీల్లో నుంచి డీజిల్ చోరీకి యత్నం

- పోలీసులను చూసి పారిపోయిన దొంగలు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండల కేంద్రం పరిధిలో నల్లగొండ బైపాస్ వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేసేందుకు యత్నించారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకోగా దొంగలు పారిపోయారు. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలో నల్లగొండ బైపాస్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీల వద్ద శుక్రవారం రాత్రి ఇన్నోవా కారు అనుమానాస్పదంగా ఆగి ఉండడంతో పక్కనే ఉన్న టీస్టాల్ యజమాని డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారును పరిశీలిస్తుండగా.. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. వాహనాన్ని పరిశీలించంగా 50 లీటర్ల సామర్థ్యం గల 30 డీజిల్ క్యాన్లు, మూడు ప్లాస్టిక్ పైపులు లభించాయి. అందులో 24 క్యాన్లలో డీజిల్ ఉండగా.. 8 క్యాన్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 1200 లీటర్ల డీజిల్, ఇన్నోవా కారు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలను పరిశీలించగా చౌటుప్పల్ మండలం రెడ్డిబాయి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీలో నుంచి డీజిల్ దొంగిలించి పట్టుబడిన ఇన్నోవా వాహనంలో తరలిస్తున్నట్లు రికార్డయ్యిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని నెలలుగా గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా వాహనంలో వచ్చి హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి పక్కన ఆగి ఉన్న లారీల్లో డీజిల్ దొంగతనం చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో పాము

భువనగిరి: భువనగిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం రాత్రి పాము రావడంతో రోగులు గమనించి దానిని చంపేశారు. ఆస్పత్రి ఆవరణలో చెత్త వేస్తుండడం, విద్యుత్ దీపాలు సరిగా లేకపోవడంతో పాములు వస్తున్నాయని రోగులు అంటున్నారు. ఆస్పత్రి ఆవరణను శుభ్రంగా ఉంచడంతో పాటు రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వేయాలని కోరుతున్నారు.

బోనాల పండుగ.. ఉపాధి మెండుగ

- గ్రామాల్లో శ్రావణమాసం బోనాల సందడి
- కుండలు, నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు, బ్యాండ్, డప్పులు, ఎల్ఈడీ లైటింగ్‌కు ఫుల్ గిరాకీ

సండే స్పెషల్



రామగిరి(నల్లగొండ), సూర్యాపేట అర్బన్: ఉమ్మడి జిల్లాలో శ్రావణ మాసం బోనాల సందడి నెలకొంది. హైదరాబాద్‌లో ఆషాడమాసంలో బోనాలు నిర్వహిస్తే, పల్లెల్లో మాత్రం శ్రావణమాసంలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పండుగకు ఇంటికొచ్చే బంధువులు, ఆడపడుచుల రాకతో బోనాల వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బోనాల పండుగ సామాజికంగా, ఆర్థికంగా చాలామందికి ఉపాధి కల్పిస్తోంది.

మట్టి కుండలకు గిరాకీ

బోనాల పండుగలో భాగంగా అమ్మవార్లకు ప్రతి కుటుంబం నుంచి బోనం సమర్పిస్తారు. కుమ్మరి వృత్తివారు వివిధ ఆకారాల్లో బోనం కుండలతో పాటు దానిపై దీపం పెట్టే మూతను ఒక సెట్‌లాగా తయారు చేసి అమ్ముతున్నారు. బోనాల సీజన్‌లో కుండలకు గిరాకీ ఎక్కువగా ఉండడంతో నెల రోజుల ముందు నుంచే కుండల తయారీ ప్రక్రియ ప్రారంభించారు. ఆర్డర్లకు అనుగుణంగా కుండలు, చిన్న గురిగిలను తయారు చేసి ఇస్తున్నారు.



నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లు అ'ధర'హో..





సాధారణ రోజుల కంటే శ్రావణమాసం బోనాల సమయంలో నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. భక్తులు అమ్మవారికి నాటుకోళ్లు, గొర్రె పొట్టేళ్లను బలిస్తారు. సాధారణంగా నాటుకోడి కిలో రూ.500 ఉంటుంది. ప్రస్తుతం డిమాండ్ ఎక్కుగా ఉండడంతో రూ.600 నుంచి 700 వరకు ధర పలుకుతోంది.

కుల వృత్తులకు కలిసొచ్చే పండుగ..



బోనాల ఊరేగింపులో బ్యాండ్, డప్పు చప్పుళ్లు, డీజేలు ఉపయోగిస్తుండడంతో వారికి ఉపాధి లభిస్తోంది. మాంసం విక్రయించే వారు, చాకలి, మంగలి కుల వృత్తుల వారు, ఎల్ఈడీ లైటింగ్, నైవేద్యం తయారీకి కిరాణా సామాను కొనుగోలు చేస్తుండడంతో ఆర్థికంగా లబ్ధి చేకూరుతోంది.

వ్యాపారులు, ప్రభుత్వానికి లబ్ధి

బోనంతో పాటు అమ్మవారిని అంకరణకు పూలు, మామిడి ఆకులు అవసర ఉండడంతో పూల మార్కెట్లలో వ్యాపారం ఊపందుకుంది. కొబ్బరికాయలు విక్రయించే వారికి కూడా గిరాకీ పెరిగింది. బస్సుల్లో ప్రయాణించే వారితో ఆర్టీసీకి, బోనాల సందర్భంగా మద్యానికి డిమాండ్ పెరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.



గిరాకీ బాగుంది



శ్రావణమాసం బోనాల పండుగ సందర్భంగా కుండల గిరాకీ బాగానే ఉంది. సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు దగ్గర కుండలు పెట్టి విక్రయిస్తున్నాను. వివిధ సైజులను బట్టి రూ.150 నుంచి 300 దాకా అమ్ముతున్నాం.

– నిమ్మనకొట్టి పూలమ్మ, కుండల వ్యాపారి, సూర్యాపేట

రకరకాల డిజైన్లతో తయారు చేస్తున్నాం



వివిధ రకాలుగా బోనం కుండలను డిజైన్ చేసి అమ్ముతున్నాం. బోనం కుండ మూత దానిమీద పెట్టే గురిగి, వెయ్యి గండ్ల బోనం, సాదా బోనం కుండ, అలంకరణ చేసిన బోనం కుండలను విక్రయిస్తున్నాం. వెరైటీని బట్టి ధర ఉంటుంది.

– మురళి, కుమ్మరి బజార్, సూర్యాపేట

ముందుగానే ఆర్డర్లు ఇస్తారు



బోనాల పండుగ కోసం మట్టి కుండలు, చిన్న గురుగులు, దీపం మూతలను ముందుగానే ఆర్డర్లు ఇస్తారు. దానికి అనుగుణంగా తయారుచేసి పంపుతాం. ఇంటి వద్ద కూడా విక్రయిస్తాం. నెల రోజుల పాటు ఆర్థికంగా చేదోడుగా ఉంటుంది.

– బొడ్డుపల్లి మల్లయ్య, కుండల తయారీదారుడు, నల్లగొండ